
కారు చాలా స్పీడుగా దూసుకొస్తున్నదల్లా... హఠాత్తుగా రెండు కుదుపులు యిచ్చి టక్కున ఆగిపోయింది.

కారులోంచి డ్రైవర్ దిగి....పరుగున కారుముందుకెళ్లి బోనెట్ ఎత్తి ఆ చీకట్లోనే తడుముతూ....ఎక్కడ లోపముందో వెతుకుతున్నాడు.

అప్పుడు సమయం అర్ధరాత్రి పన్నెండయింది. కానీ వెన్నెల వెండి వర్షంలా వుండి పరిసరాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి.


ఆ కారులోంచి తండ్రీ, కూతుళ్లిద్దరూ దిగారు. ఆయనొక రిటైర్డ్ ఐ.జి. వారి అమ్మాయి



పేరు హరిత. అంతవరకూ కారులో కూర్చుని కూర్చుని విసుగెత్తినట్టుంటే కారు ఆగిపోగానే దిగి....రిలాక్స్‌డ్‌గా నిలుచుంది. ఆయన మాత్రం సిగార్ వెలిగించుకుని డ్రైవర్ ప్రక్కకి వెళ్లి నిలబడ్డాడు యింజన్‌వైపు చూస్తూ!

హరిత పరిసరాలను చుట్టూతా చూస్తూ గమనించింది. కారు సరిగ్గా స్మశానం ముందాగింది. స్వతహాగా ధైర్యస్థురాలైనా ఎందుకో ఆమెకి వణుకు సన్నగా పుట్టుకొచ్చింది. దూరంగా సమాధులలోంచి ఏదో తెల్లగా లేస్తున్నట్లు కదులుతూ కనిపించింది. తల విదిలించుకుంటూ దృష్టిమార్చి వెన్నెల నీడలున్న చీకట్లోకి చూస్తూ నిలుచుంది. ఇంతలో వీపుమీద చల్లగా ఏదో స్పర్శ... తగిలింది.

హరిత వెన్నులోంచి జర్రున చలి పుట్టుకొచ్చింది. అంత చలిలోనూ చెమట్లు పడుతున్నాయి. యింతలో - ఎవరిదో చెయ్యి భుజంమీద బలంగా పడటంతో వెనక్కి తిరుగుతూ చూసింది.. ..అంతే !




వెంటనే ఆమె పెట్టిన కేక ఆ ప్రాంత మంతా ప్రతిధ్వనించింది!

మరుక్షణం తనని పట్టుకున్న ఆ ఆకారం చేతుల్లోనే స్పృహ తప్పిపడిపోయింది!

చివరిసారిగా....ఆమె విన్న శబ్దం...“ చందనా! చందనా!!” అని ఎవరో పిలవటం! అంతే !

************

“ఎవర్నువు?” గద్దించాడాయన.

“నా పేరు... సూర్య” గొణిగాడా యువకుడు.

“మా అమ్మాయి నీకు ముందే తెలుసా? అంత అర్ధరాత్రి అక్కడేం పని నీకు? చందనా! చందనా! అన్నావు ఎవరు?...”

“నేను మీ అమ్మాయిని పట్టుకున్నందుకు సారీ. కానీ నేనామెని నా చందన అనుకున్నాను. నేను అనుకోవటమేమిటి? ఈ ఊళ్లో ఎవర్నడిగినా చెబుతారు. మీ అమ్మాయి, చందన ఒకటేనని...కావాలంటే ఫొటో చూడండి....” అంటూ ఓ అమ్మాయి ఫోటో తీసి చూపించాడు. అచ్చం హరితలాగానే వుంది. వేషం మాత్రం డిఫరెంట్‌గా వుంది. హరిత చూడీదార్‌లో....ఆ అమ్మాయి చీరలో.... అదే తేడా.

హరిత కూడా ఆ ఫోటో చూసి ఆశ్చర్యపోయింది!

“ఎవరీమె?....” అనడుగుతూ తెల్లటి లాల్చీ, పైజామా వేసుకున్న అతణ్ణి చూస్తూ...“అయితే నిన్నరాత్రి సమాధుల మధ్య నువ్వేనా కనిపించింది....?” అడిగింది.

“అవును....నేనే ఆ దౌర్భాగ్యుణ్ణి.”

“ఎందుకు అక్కడున్నావ్? నిజం చెప్పు అసలేమిటీ మిస్టరీ...”

ఓ క్షణం ఆగి చెప్పాడు - "చెబుతాను - నాగురించి అంతా చెబుతాను. నా చందనా ఎవరో....ఎలా నాకు దూరమయిందో కూడా చెబుతాను...." అంటూ వివరంగా తన కథనంతా చెప్పసాగాడు.

**************

సూర్య మంచి ఫోటోగ్రాఫర్. అడ్వర్టైజ్‌మెంట్‌లకు పని చేస్తాడు. ఆ ఊర్లో మంచి లొకేషన్స్ వున్నాయని తెలిసి షూట్ చేసేందుకు వచ్చి అనుకోకుండా చందనని చూసి బోల్తాపడ్డాడు.

చందనా అతి సాధారణమైన కుటుంబంలో పుట్టిన అమాయకురాలు. కానీ అద్భుతమైన సౌందర్యం ఆమెది. అందాల పోటీల్లో నిలబెడితే మిస్ యిండియాగా కూడా సులభంగా సెలక్టవుతుంది !

సూర్య ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. కొద్ది కాలంలోనే ఆ పరిచయం ప్రేమగా, విడదీయరాని అనుబంధంగా తయారయింది. ఒకరి నొకరు విడిచి వుండలేని పరిస్థితికొచ్చారు. చందనకి తండ్రి లేడు. తల్లి మాత్రమే వుంది.

***********

ఒకరోజు అనుకోకుండా చాలా దారుణమైన సంఘటన జరిగింది. ఆ ఊరి ప్రెసిడెంట్ చందనని చూశాడు....వెంటనే మనసు పడ్డాడు. అతడు మనసుపడ్డాడంటే.... ఆ అమ్మాయి ఎవరైనా సరే ఆ రాత్రికి అతని మహల్లో అతని బెడ్ రూంలో సర్వనాశనమై వాడిపోవాల్సిందే. అది అందరికీ తెల్సిన విషయమే. కానీ ఎదురు చెప్పలేరు.... అంత దుర్మార్గుడతడు.

## చందనా!... చందనా!...

చందన విషయంలో ఏర్పాట్లు మరి కొంచెం వేగంగా జరిగిపోయాయి. అతను, వాళ్ల అమ్మకి పదివేలిచ్చి చందనని కొనుక్కున్నాడు. ఆ తల్లి డబ్బును చూసి ఆశపడి సగం, అతడి దుర్మార్గాన్ని చూసి సగం భయపడి లొంగిపోయింది. చందనని బలవంతంగా మహల్‌కి ఎత్తుకొనిపోయారు.

ఆ విషయం కొంచెం ఆలస్యంగానైనా తెలుసుకున్న సూర్య....మహల్‌కి నేరుగా వెళ్లి చందనని రక్షించుకున్నాడు.

అప్పుడే....నిర్ణయించుకున్నాడు ప్రెసిడెంట్ - సూర్యని బలం కంటె... తెలివి ఉపయోగించి నొక్కేయాలని. అప్పుడే, అతని మస్తిష్కంలో ఓ ఆలోచన రూపు దిద్దుకుంది.

అప్పటికి మాత్రం ఏమీ జరగనట్లు వుండిపోయాడు.

ఆరోజు రానే వచ్చింది. సూర్య ముఖ్యమైన పనిమీద వైజాగ్ వెళ్లాడు. తిరిగిరావటానికి మూడు రోజులుపట్టింది. తిరిగి వచ్చేసరికి... ఊళ్లో అడుగుపెట్టగానే అతనికి విన్పించిన పిడుగులాంటి వార్త!

"చందన చచ్చిపోయింది - అదీ ఆత్మహత్య చేసుకుని..." అన్నదే.

***********

"ఇదీ జరిగిన కథ క్లుప్తంగా. అంతే తెలుసునాకు....చందన అసలు ఎందుకు ఆత్మహత్య చేసుకుందో, అసలెలా చనిపోయిందో ....అసలెందుకు చనిపోయిందో, ఆ పరిస్థితులేమిటో...నా కిప్పటికీ అర్థం కాకుండా వున్నాయ్! నాకా విషయాలు చెప్పేందుకు ఆమె చనిపోవటం చూసిన మనిషి ఒక్కరూ లేరు....."

"మరి చందన శవం ఏమయిందట?"

"కాల్చి బూడిదచేసి, బూడిదని సమాధిచేసి....సమాధి కట్టించేశారు...."

"ఎవరు?"

"ఊరివాళ్లే...."

"అలా ఆ పని వాళ్లచేత చేయించిందెవరు?" పోలీస్ బుర్ర చురుకుగా పని చేస్తోంది రిటైర్డ్ ఐ.జి. ఆఫీసర్‌లో.

"అది చెప్పేవాళ్లే వుంటే యింకేం? చెబితే వాళ్ల ప్రాణాలుండవు..."

"మీరెవరిని సస్పెక్ట్ చేస్తున్నారు... మిస్టర్ సూర్యా?"

"ఇంకెవర్ని? ఈఊరి ప్రెసిడెంట్‌నే... వాడే నీచుడు...."

"నీచుడు కాక మరో పేరేమైనా ఉందా?"

"ఉంది.

ఏకాంబరం..." అంటారంతా.

"అప్సరే....మీరా సమాధులమధ్య అంత అర్ధరాత్రి వరకు ఏం చేస్తున్నారు.?" హారిత అడిగింది.

సూర్య విషాదంగా నవ్వి..."ఏం చేస్తాను? నా చందన సమాధి దగ్గర కూర్చుని, ఆమెతో మాట్లాడి నిద్రవుచ్చి వస్తున్నాను - అంటే మీకు నవ్వు వస్తుందనుకుంటాను -

కాని నాకిదే దినచర్య..

హారిత చలించిపోయింది. అతనామెని ఎంతగా యిష్టపడ్డాడో తెలిసి ఆశ్చర్యపోయింది. లోకంలో యిలాంటి వాళ్లు కూడా వుంటారా? అన్పించింది. ఎందుకంటె ఆమె చూసిన ప్రపంచం చాలా చిన్నది.

"మనమిక వెళ్లిపోదామా డాడీ...." అంది హారిత కొంతసేపటికి.

ఐ.జి. సిగార్‌లోంచి పొగపీలుస్తూ..."న బేబీ! మనమెళ్లిపోతే ఈ సమస్య యింతటితో ఆగిపోదు. రేపు మరో అమ్మాయి బలి అవుతుంది. వాణ్ని అరెస్ట్ చేయాలి. అదీ అతను నేరం ఒప్పుకునేలా చేయాలి.... అదీ తన నోటి ద్వారా తానే చెప్పుకునేలా చేయాలి...ఏ మర్డరర్ మస్ట్ బి ఫినిష్డ్."

"ఎలా?" సూర్య అడిగాడు.

"దానికో ప్లాన్ వుంది." అని ఫోన్ దగ్గరకెళ్లి....తనకు తెలిసిన డి. యస్.పి.కి

## రచయిత పరిచయం

తృతీయ బహుమతి రు. 700/-లు పొందిన కథ "చందనా! చందనా!" రచయిత డా. మునీర్ అహమద్ అన్సారీ వెటర్నరీ డాక్టర్. "విధాత" వీరి కలం పేరు. పుట్టింది, పెరిగింది గిద్దలూరులో. సంవత్సరం క్రిందటే తిరుపతిలో వెటర్నరీ సైన్సుడిగ్రీ పూర్తిచేసి ప్రస్తుతం ఒక సాంఘిక సేవా సంస్థలో వెటర్నరీ డాక్టరుగా పని చేస్తున్నారు.

"విధాత" తండ్రిగారు రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ఆర్మీ ఆఫీసరు. తండ్రి స్మృతి గుర్తొచ్చినప్పుడు పడే ఆవేదనలో ఆయన కథలు, కవితలు రాస్తుంటారట.



తన తొలి కథ "చందనా! చందనా!"కి బహుమతి లభించడం తనకి చాలా సంతోషంగా వుందంటున్నారు.

కొంతమంది పోలీసులుతో రమ్మని కోరి..... ఫోన్ పెట్టేశాడు!

****************

సూర్య యింట్లో అందరూ సమావేశమయ్యారు.

హారితని చూసిన ఒకరిద్దరు...."దెయ్యం కాబోలు దెయ్యం" అని సణుగుతూ భయపడి దూరంగా పారిపోతూంటే...

ఐ.జీ.కి నమ్మకం కలిగింది హారిత, చందన పోలికల్లో ఒకేలా వుండేవారని.

రిటైర్డ్ ఐ.జీ.కి యిప్పుడు తన ప్లాన్ మీద గట్టి నమ్మకం ఏర్పడిపోయింది. అందరికీ తన ప్లాన్‌ని మరోసారి వివరించారు.

"ఇందులో హారిత పాత్ర చాలా ఎక్కువగా ఉంది. ఆమె తన వర్క్ బాగా చేయగలిగితే ప్లాన్ సక్సెస్ అవుతుంది." అందుకని ఆమెకి ఏం చేయాలో పదే పదే వివరించి చెప్పాడు.

"సో....మన యీ ప్రోగ్రామ్ అంతా అర్ధరాత్రి పన్నెండుగంటలకు ఏకాంబరం మహల్లో జరుగుతుంది. సరిగ్గా పన్నెండున్నరకు నేను హారితని తీసుకుని కార్లో మహల్‌ని చేరుకుంటా."

అందరూ తలలూపారు.

టేప్‌రికార్డర్‌లు, భయంకరమైన సౌండ్స్ వున్న టేప్స్...లాంటి సరంజామా అన్నీ సిద్ధం చేశారు

ఆ రోజు అమావాస్య యాదృచ్ఛికంగా జరిగింది.

***********



## మాస్కో ఫిల్మోత్సవ్‌లో కొరియా నటికి అవార్డు

16వ మాస్కో అంతర్జాతీయ ఫిల్మోత్సవంలో ఉత్తమనటి అవార్డు కొరియా నటికి లభించింది.

కాంగ్-సు-యోన్ అనే 23 సంవత్సరాల ఈనటి 'అజే అజే బారా అజే' (రా, రా, పైకిరా) అనే చిత్రంలో చూపిన నటనకు గుర్తింపుగా ఈ అవార్డు బహూకరింప బడింది.

ఇది కాంగ్‌కు వచ్చిన రెండవ అంతర్జాతీయ అవార్డట.

1987లో జరిగిన 44వ వెనీస్ అంతర్జాతీయ ఫిల్మోత్సవంలో ప్రదర్శించిన 'స్పిబాజీ' (సరోగేట్ మదర్) అనే చిత్రంలో ఆమె చూపిన నటనకు గుర్తింపుగా ఉత్తమనటి అవార్డు తొలిసారిగా లభించింది.

బౌద్ధ సన్యాసిని పాత్రలో కాగ్ నటించిన 'అజే, అజే' చిత్రం ఈ ఫిల్మోత్సవంలో సంచలనం సృష్టించింది.

తన తల్లి ప్రియుడు మానభంగం చేయటంతో జీవితంమీద విరక్తిచెంది బౌద్ధ సన్యాసినిగా మారిన యువతికథే ఈ 'అజే అజే'.

ప్రపంచంలో జరిగే ఫిల్మోత్సవాలలో అత్యంత ప్రతిష్ఠాకరమైన ఉత్సవాలలో ఒకటైన ఈ మాస్కో ఫిల్మోత్సవం 1959లో ప్రారంభమైంది.

తాష్కెంట్, రష్యాలలో కూడా ఈ చిత్రం ప్రదర్శించేందుకు ఏర్పాట్లు జరుగు తున్నాయి.

సియోల్‌లో జన్మించిన కాంగ్ 10 సంవత్సరాల వయస్సులో 'బ్లడ్‌నాట్స్' అనే చిత్రంలో ధరించిన పాత్ర చిత్రసీమలో ఆమెకు పేరు సంపాదించిపెట్టింది.ఆ తర్వాత దాదాపు 30 చిత్రాలలోను, టెలివిజన్ డ్రామాలలోను ఆమె నటించింది.

ఈ అవార్డులు ముందు ముందు తన బాధ్యతను మరింత పెంచాయని కాంగ్ అన్నారు.

ఇమ్ క్వాన్ టేక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఫ్రాన్సులో జరిగే నాంటెస్ మూడవ కాంటినెంటల్ ఫిల్మోత్సవంలో కూడా ఈ చిత్రం పాల్గొనబోతున్నది.

---

ఏకాంబరం తాపీగా గుర్రుపెడుతూ హాయిగా నిద్రపోతున్నాడు.

హఠాత్తుగా మెలకువ వచ్చింది అతనికి. మళ్లీ నిదురపోయే సమయంలో విన్పించిందా శబ్దం!

ప్రక్కనే...అతని సమీపంలోనే....

ఏదో జంతువు గురక పెడుతున్నట్టుగా వుంది. ఉలికిపడి లేచాడు ఏకాంబరం. బెడ్‌లైట్ కాంతి సరిపోవటం లేదు. లేచి లైట్ స్విచ్ నొక్కాడు. ఆ రూం అంతా వెలుగుతో నిండిపోయింది.

అంతలో కర్టెన్స్ వెనుక ఏదో కదలిక....

ఏకాంబరం సంశయిస్తూనే వెళ్లి కర్టెన్ ప్రక్కకి తొలగించాడు.

ఓ అస్థిపంజరం అతని మీద పడటంతో - ఏకాంబరం భయపడి భయంకరంగా కేకేశాడు. ఎందుకో అతనిలో ధైర్యం సన్నగిల్లుతోంది. అదే సూర్యకు కావాల్సింది. అంతవరకు తాము అనుకున్నట్టు జరిగింది ఆ తర్వాత విచిత్రమైన సంఘటనలు ఎవరూ చేయకుండానే జరిగిపోయాయి!

హఠాత్తుగా గాలి అలలు అలలుగా ఆ గదిలోకి దూసుకొచ్చింది. ఎక్కడి వస్తువులు అక్కడ పడిపోయాయి. సోఫాలయితే గిర్రున తిరిగి ఎగిరి అద్దాల కిటికీలకు తగిలి భళ్లున అద్దాలు పడిపోవటంతో.... ఎవరో విసిరేసినట్లుగా బయట పడిపోయాయి. హోరుమని గాలి చీలుస్తున్న చప్పుడు.

తాము అరేంజ్ చేసిన వాటికన్నా ఎక్కువ ఎఫెక్ట్స్ అన్నీ ఎలా వచ్చాయో ఎవరికీ అర్థం కావటం లేదు కానీ ఎవరికి వాళ్లు జరిగేది చూస్తున్నారు.

ఏకాంబరానికయితే భయం ఎక్కువయిపోయింది. అతని మంచం గాలి తాకిడికి జరుగుతూ వెళ్లి గోడకు గుద్దుకుని ఆగిపోయింది. అంతలోనే భయంకరమైన అరుపులూ, వికటాట్టహాసాలు విన్పించాయి. ఒక్కసారిగా వందలకొద్దీ క్రూర మృగాలు అరిచినట్లుగా కర్ణకఠోరమైన శబ్దం. తలుపులన్నీ మూసుకుపోయాయి -

అప్పటికి పరుగెత్తుకొచ్చిన పని మనుషులూ, వాచ్‌మెన్‌లు వచ్చి తలుపులు బాదుతున్నారు. సడెన్‌గా కరెంట్ పోయింది.

సూర్య ఆశ్చర్యపోయాడు. తీగలు యింకా కట్ చేయకుండానే పవర్ కట్ కావటం ఎలా జరిగింది?

ఏకాంబరం వణికిపోతున్నాడు. అతని

జన్మలో యిలాంటి పరిస్థితి ఎదురవటం యిదే మొదటిసారి. బహుశా ఆఖరుసారి కూడా నేమో? ఎందుకంటే యిక బ్రతుకుతాననే నమ్మకం అతనిలో సన్నగిల్లింది. అతని చేతులు రెండూ స్తంభానికి చుట్టుకుని వున్నాయ్. హఠాత్తుగా గాలి తగ్గింది. తుఫానులా వీస్తున్న గాలి ఆగిపోయింది.

సడెన్‌గా నిశ్శబ్దం ఆవరించింది.

ఏకాంబరం స్తంభం వదిలి గది తలుపులవైపు అడుగులు వేస్తుంటే.... విన్పించిందా చప్పుడు ఘల్లు....ఘల్లు..... మంటూ.

తనని నెమ్మదిగా ఎవరో సమీపిస్తున్న భావన.

కానీ చీకట్లో ఏమీ కనిపించట్లేదు.

"ఎవరూ?" గొంతు కీచుమంది ఏకాంబరానికి.

సమాధానం లేకుండా నవ్వు విన్పించింది.....

"ఎవరది?...." యింకా భయం తగ్గ లేదతనిలో.

మళ్లీ నవ్వు ఈసారి భయంకరంగా......

"నేనేరా....." ఆ గది ప్రతిధ్వనించింది.

"నేనే....అంటే?!" కొంచెం ధైర్యం తెచ్చుకుని అడిగాడు ఏకాంబరం.

"హి....హి....హి....హి...." అతి భయంకరంగా వుందా నవ్వు.

"నువ్వు చంపి పాతిపెట్టిన చందనని...."

ఏకాంబరం ఏదో అనబోయేంతలో - ఒక బలమైన హస్తం అతణ్ణి ఎత్తి మూలకు విసిరేసింది. నుదురు చిట్లిందతనికి.

లేస్తూ....అటూ యిటూ చూశాడు. ఏమీ కన్పించలేదతనికి. ప్రాణభయంతో పరుగెత్తబోయాడు.

## చందనా!... చందనా!...

అంతలోనే కరెంట్ వచ్చింది. గదంతా వెలుగుతో నిండిపోయింది.

ఒక్కసారిగా లైట్లన్నీ వెలిగేసరికి వెలుగు చూడలేక కళ్ళుమూసేసి...అలవాటు పడ్డాక నెమ్మదిగా కళ్ళు తెరచి గదంతా కలియ చూశాడు. సామానులన్నీ చిందరవందరగా వున్నాయి. నేల మీద రక్తం చుక్కలు చుక్కలుగా కారి వుంది.

తడిమి చూశాడు. నిజంగా రక్తమే.

అంతలోనే హుమ్మంటూ శబ్దమయింది.

ఏకాంబరం అటు చూశాడు-అక్కడి దృశ్యాన్ని చూడగానే ఎంతో కఠినాత్ముడైన వాడైనా... ఏకాంబరానికి గుండెలు జారిపోయాయి.

అక్కడ-

చందన జుట్టు విరబోసుకుని...హ్హా హ్హా మని నవ్వుతూ నిలబడి వుంది!

సూర్య ఆశ్చర్యపోతున్నాడు-పన్నెండున్నరకి రావాల్సిన హరిత ఏంటి అప్పుడే వచ్చేసింది? అయినా....ఎంత గొప్పగా యాక్ట్ చేస్తోంది? నిజంగా అతనికే భయమేస్తోంది ఆమెని అలా చూస్తుంటే...చందనే వచ్చిందా? అన్నట్టుంది.

అంతవరకూ ఆ గదికి ప్రక్కగా వుండే గదిలో వున్న సూర్య మెల్లిగా ఏకాంబరం గదిలోకి వచ్చేశాడు.

అప్పటికే టేప్ ఆన్ అయి తిరుగుతూ వుంది.

ఏకాంబరం వణికిపోతూ అడుగుతున్నాడు...."నువ్వా....నువ్వా....."

"నేనేరా చందనని...."

"నువ్వు చచ్చిపోయావుగా.."

"అవును? నువ్వే చంపావు కదా! కాని నిన్ను కూడా నాతో తీసుకుపోదామని వచ్చాను.

"లేదు. నేనేమి చేయలేదు. నన్ను వదిలిపెట్టు నిన్ను చంపింది నేను కాదు పొరపాటైంది. నన్ను క్షమించి వదిలెయ్యి" నిలువెల్లా కంపించిపోతు అన్నాడు. అతని గొంతు తడారిపోయింది. దండాలు పెడుతున్నాడు.

"నిన్నా....తుచ్ఛుడా! బ్రతికున్నప్పుడు నన్ను పొందలేక....చచ్చాక నా శవాన్ని ఛీ! ఛీ! నీలాంటి నీచుణ్ణి బ్రతకనిస్తానా!"

సూర్యకు అంతు బట్టడం లేదు.

హరిత తండ్రి ప్లాన్ ప్రకారం....ఆమె దెయ్యంలా నటించి అతను చేసిన నేరాన్ని అతని తోనే చెప్పించటం...కానీ ఈమె తనే జరిగిన విషయాలన్నీ చెప్తూ...అతని చేత ఒప్పిస్తోంది.

ఈమెకిన్ని విషయాలు ఎలా తెలుసు?

అసలెవరీమె? హరితేనా? లేక చచ్చిపోయిన చందనా? సూర్య వళ్లు జలదరించింది.

"ఏదో తెలియక అలా చేశాను. ఇక నా జన్మలో ఏ ఆడపిల్ల జోలికి పోను. నన్ను వదిలెయ్యి....ప్లీజ్...." ఏకాంబరం ఏడుస్తున్నాడు.

చందన నవ్వుతూ....అతన్ని సమీపించసాగింది.


ఏకాంబరం "హెల్ప్....హెల్ప్" అంటూ అరుస్తున్నాడు.

అంతవరకు ప్రక్క గదిలో వున్న డి.ఎస్.పి. అతని బలగం టెన్షన్‌ని ఆపుకోలేక బయటికి వచ్చి ఆ గదికి వున్న అద్దాల తలుపుల్లోంచి చూస్తూ నిల్చున్నారు. వాళ్ల లోనూ ఆశ్చర్యం!

ఏకాంబరాన్ని సమీపించిన చందన అతణ్ణి పట్టుకోబోయింది. భీకరంగా అరుస్తూ అతణ్ణి గోడకేసి విసిరేసింది. అతను వెనక్కి వెనక్కి పరుగెడుతూ గోడను తాకి తల్లక్రిందులై పడిపోయాడు.

సూర్య అదిరిపోయాడు-బిక్కచచ్చిపోయాడు.

ఏమిటీమె....యాక్ట్ చేయమంటే హత్య చేసేసింది. వాడు క్రిందపడి సఫా...అనుకొని అందరూ ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే ఆ గది తలుపులు తెరచుకుంటూ జుట్టు విరబోసుకున్న హరిత ఆ గదిలోకి అడుగు పెట్టి....భయంతో కేకలు వేసింది. దాంతో యిందాకా వచ్చిన చందన ఈ చందన ఒక్కరు కాదని తేలిపోయింది అందరికీ-అ వచ్చింది నిజంగా దెయ్యమేననిపిం



చింది!

*** *** *** *** *** ***

"మీకెందుకంత లేటయ్యింది."

"ఏం చెయ్యను? హారితను కారులో తీసుకువస్తుంటే...సడన్‌గా స్పృహ కోల్పోయింది. ఆమె కోలుకుని వచ్చేసరికి ఇక్కడ అరుపులు అవీ వినిపించాయి. విషయం ఏమిటని అడిగితే బయట పని మనుషులు చెప్పారు. లోపల చందన భూతం వుందని" ఆ తర్వాత చెప్పిన వాళ్ళు కూడా హారితను చూసి పారిపోయారనుకోండి అంటూ షాక్ నుంచి తేరుకొనే నవ్వు నవ్వాడాయన.

"అయితే ఆ వచ్చింది నిజంగా చందనే అన్న మాట"

"అందుకే కాబోలు టేప్‌లో ఏకాంబరం మాటలు రికార్డ్ అయ్యాయి. కాని చందన మాటలు రికార్డు కాలేదు." డి.ఎస్.పి. అన్నాడు టేప్ ఆఫ్ చేస్తూ.

"ఎనీ హౌ మనం వచ్చిన పని అయిపోయింది. ఇక వెళ్లిపోదాం! పోయే ముందు ఒక చిన్న ప్రపోజల్ చెయ్యాలనుకుంటున్నా...." అని తన కూతురు హారిత వైపు చూస్తూ... "నాకు సూర్య నచ్చాడు. నా కూతురికీ ఇతనికి మ్యారేజ్ సెటిల్ చేద్దామనుకుంటున్నాను. ఏమంటావమ్మా..." అంటుండగానే....హారిత లేచి వేగంగా వెళ్లి సూర్యను గట్టిగా కౌగలించుకుని గాఢంగా ముద్దుపెట్టుకుని బయటికి నడిచింది.

ఆ విచిత్రమైన సంఘటనని ఆశ్చర్యంతో అందరూ చూస్తుండగానే మళ్ళీ లోపలకి వచ్చింది హారిత....

"ఎవరు డాడీ ఆ అమ్మాయి అచ్చం నాలాగే ఉంది! నా గుండెలు జల్లుమన్నాయి."

"మైగాడ్! ఇప్పుడు బయటికి వెళ్ళింది నువ్వు కాదా!"

"నో డాడీ....నేనిప్పుడె చందన గెటప్ చేసుకొని బట్టలు మార్చుకుని వస్తున్నాను" అన్నది.

"అయితే....ఆమె?!"

"చందనే" ఎక్సయిటింగ్‌గా అన్నాడు సూర్య. ఆమె నా చందన. అనుమానం లేదు... నా చందనే. సూర్యతో మరుక్షణం అందరు బయటికి పరుగెత్తారు.

కానీ-అక్కడెవరూ లేరు!!

చందనా? చందనా! అన్న సూర్య కేక మాత్రం నలుదిక్కులా ప్రతిధ్వనించింది.

○



# బట్టతల అని బెంగపడకండి!

బట్ట తల వల్ల అనేక ఉపయోగాలున్నాయని, అది చూసి బెంగపడాల్సిన పనిలేదని, అదొక వరంగా భావించమని చెప్తున్నారు అనేక మంది నిపుణులు.

నెత్తి మీద జుట్టు మొలిపిస్తామని యిచ్చే ప్రకటనల్ని చూసి మోసపోవద్దని కూడా వారు అంటున్నారట.

మనిషిలో సెక్స్ హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తి అయినట్లయితే సహజంగా జుట్టు వూడిపోతుందని, అందువల్ల తొందరపడి ఏ మందులూ ఉపయోగించరాదని లండన్‌లోని నిపుణులు కొంత మంది తెలియజేస్తున్నారు.

జుట్టు వూడినంత మాత్రాన విచారించవలసిన పనిలేదని దానివల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని వారు చెప్తున్నారు. పత్రికల్లో పడే ప్రకటనలను చూసి డబ్బుని, సమయాన్ని వృధా చేసుకోవద్దని కూడా వారు సలహా యిస్తున్నారు. రకరకాల ఔషధాలను వాడటం ద్వారా మనకు కావలసిన ప్రయోజనం చేకూరకపోగా యితర రకాలైన జబ్బులకు లోనుకావలసి వస్తుందట.

## మహిళలకి యిష్టం?

ఈ బట్ట తలవల్ల కలిగే ప్రయోజనాలను సూచిస్తూ-అనేక మంది మహిళలు బట్టతల వాళ్లనే ఎన్నుకోవడం కూడా జరుగుతుందంటున్నారు. బట్టతల గల వారిలో సెక్స్ హార్మోన్లు ఎక్కువగా వుంటాయన్న నమ్మకమే అందుకు కారణం కాబోలు! ఇదీబాగానే ఉంది. అలా అని కావాలని జుట్టు తీయించుకుంటే మాత్రం మహిళలు ముందుకు రారు సుమా!

జుట్టు పెరిగిపోతున్నట్లయితే దానికయ్యే ఖర్చు లెక్కలేనిది కదూ! ఆ జుట్టే లేదనుకోండి ఎంచక్కా నూనెల ఖర్చూ తప్పతుంది, క్షుర కర్మ ఖర్చూ తగ్గుతుంది, దువ్వుకునే శ్రమా తప్పతుంది! బట్టతల వుంటే రకరకాల టోపీలు ధరించి హాయిగా, వుషారుగా షికారు కెళ్లిపోవచ్చు.

తన బట్టతల చూసి ఎంచక్కా హాయిగా నవ్వుకుంటున్నాడో చూడండి ఫొటోలోని కుల్ భూషణ్ ఖర్బందా.

○